

అదిగో...చల్లగా మెల్లగా ఆ పారునది యమున! ... వొడ్డున ఆ ఊరు గోకుల బృందావనం, ఆ వాడ ఆ పల్లె వ్రేపల్లెవాడ! ఔనా...!

ఔను-కాదు-ఔను! ఏరేదైనా, ఊరేదైనా, అది యమునా నదే, అది గోకుల బృందావనమే, వ్రేపల్లెవాడే!

అవిగో ఆ తీరాన వేణుగోపాల ఆలయ గోపురాలు ... తెల్లగా మల్లె మొగ్గల్లా నీలాలనీరాల ప్రతిబింబించి అల్లారుగా ఓలలాడుతున్నవి......నును సంజవేళ, మలయ తెమ్మెర అలలకు ఏటి చిరుతరగల గలగల శృతిగా కాంభోజి రాగాన మంద్ర మోహన స్వరాన సన్నగా సన్నజాజి తావిలా వినిపిస్తున్న ఆ పల్లవి.........

"ఇటుచేసి నన్ను విడనాడ న్యాయమా వేణుగోపాలా!"

ఆ పల్లవి ఆలపిస్తున్న పల్లవకోమలి ఎవరో...ఏం చేశాడో మరి?. ......

**"అలనాటి మునిమాపు వేళ ఎవరూ లేని వేళ**

వలువలు దిగవిడచి - మేను
మైమరచి
నీలాలనీరాల జలకమాడేవేళ
వగకాడ వలరాయ మాయగాడ
వేణుగోపాలా!
నీట-నన్ను నట్టేట ముంచితివి గద
॥ఇటుచేసి...
అన్నెముపున్నెము ఏ మెరుగని
ముద్దరాల
పదారు వన్నెల మేలిమి కన్నె
జవరాల ॥ఇటుచేసి...
నీదాన వేచిన చిన్నదాన-నిన్నె
నెఱ నమ్మినదాన
ఏలుకో నన్నేలుకో వేణుగోపాలా!
॥ఇటుచేసి...

ఆ కన్నెబంగారును ఏమో చేసినాడట-నట్టేట ముంచినాడట...ఏనాటి నుండో తన్ను నిండుగా దోచుకున్నవాడు, తన యెదనున్నవాడు వింటున్నాడని ఒక్కొక్క రాగాన అనంత మధురరాగాలలో ఏలుకోమని నట్టేట చిం జవ్వనిగా వేడుకొంటున్నది ... పాడుకొంటున్నది-ఆ మిసిమి ముద్దరాలు-అప్పటికీ ఇప్పటికీ వన్నె తగ్గని ఆ కన్నె బంగారు ఆ పసిమిపరువాల చిన్నది...'**జావళి**'

